# యమ ఖోర్జరీ

"చిత్రగుప్తా... ఏమిటి చిత్రంగా మాట్లాడుతున్నారు? మన యమపురికి వచ్చే మానవులకు కొత్త సౌకర్యం ఏర్పాటు చేశారా?" అన్నారు యమధర్మరాజు.

సమవర్తికి భటులు రెండువైపులా వింజామరతో వీస్తున్నారు. ఆయన ప్రక్కనే బంగారు గద ఉంది, కుడిచేతిలో యమపాశం ఉంది. ఆయనకు కొంచెం దూరంలో ఆయన అధికార వాహనం మహిషరాజు గడ్డి మేస్తున్నాడు- యముని తరచూ చూస్తూ. దాని చుట్టూ యమభటులు సవరిస్తూ నిలబడివున్నారు.

పౌరాణిక సినిమాల్లో చూపించే దర్బారు హాలులా ఉంది ఆ హాలు!

ఆ హాలులో ఏకైక సింహాసనం. ఆ సింహాసనం మీద యముడు ఆసీనుడై వున్నాడు. ఆయనకు ఎడమ ప్రక్కనే పెద్ద చిట్టాపుస్తకం తెరిచి పట్టుకుని చిరునవ్వుతో కూర్చునివున్నాడు చిత్రగుప్తుడు.

"అయ్యా... చిత్తం! నిన్నటి రోజు తమరి సంతకంతో ఒక ఆర్డర్ వచ్చింది మహాప్రభో!" అన్నాడు చిత్రగుప్తుడు

"అది ఎట్లు? ఆర్డర్ చూపించండి!" అనగానే చిత్రగుప్తుడు ఒక కాగితం యమునికి ఇచ్చాడు.

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రిని ప్రధానమంత్రి రాజీనామా చేయమన్నప్పుడు- ఆ ముఖ్యమంత్రి ముఖమెలా ఉంటుందో... అలావుంది యముని ముఖం.

ఆ ఆర్డరు చూసి యముడు "నేను అసలు ఏ సంతకమూ చేయనే లేదే! ఇది ఎటుల వచ్చినది? చిత్రముగా నున్నదే!" అంటూ యముడు కుడిచేతిలోకి కిరీటము తీసి ఎడమ చేతిలో జుట్టు పీక్కొనసాగాడు.

వెంటనే చిత్రగుప్తుడు విపరీతంగా కంగారుపడిపోయి "యమరాజా! తమరు అట్లు జుట్టు పీక్కొనరాదు. తమ యొక్క కేశరాజము క్రిందపడినచో మన యమలోకము దద్దరిల్లును" అన్నాడు.

అంతే... యముడు వెంటనే తన కిరీటం తలపై పెట్టుకున్నాడు. ఒకసారి జరిగిన సంఘటన గుర్తుతెచ్చుకున్నాడు.

... ఇలాగే ఒకసారి ఒక పాపి యమరాజుని పిచ్చి పిచ్చిప్రశ్నలు వేయడంతో ఆయనకు కోపం వచ్చి జుట్టు పీక్కొనగా... రెండు కేశరాజములు యమలోకమున పడగా... యమలోకం

దద్దరిల్లింది. అప్పుడు వెంటనే చిత్రగుప్తుడు అప్పుడే వచ్చిన మానవదేహము నందలి రెండు కేశములు పీకి, యమరాజు కేశములకు జోడించి, ఆయనకు హెయిర్ వీవింగ్ చేశాడు. అప్పుడుగాని యమలోకము సామాన్య స్థితికి రాలేదు.

"అయినచో– ఈ ఆర్డర్ మనము తప్పనిసరిగా పాటించవలెనా?" అన్నాడు యముడు. ఎన్నికల ఫలితాలలో "మీరు ఓడిపోయారు" అని చెబితే– "నిజమేనా..?" అన్నట్లు చూస్తున్న రాజకీయ నాయకుని పరిస్థితిలా ఉంది ఆయన పరిస్థితి.

"అదేమిటి ప్రభూ... తమరు అట్లు శెలవిచ్చితిరి? మీ సంతకము వున్న ఆర్డర్ పాటించక ఎట్లు?"

"ఆ ఆర్డర్ నేను సంతకము పెట్టకనే ఎట్లు వచ్చినదో ఆరా తీయవలె చిత్రగుప్తా!"

"అటులనే స్వామీ! భూలోకము నందు ప్రభుత్వము వారు విడుదల చేసినట్లుగానే తయారుచేసిన నకిలీ పరీక్షా పత్రములు, నకిలీ కరెన్సీనోట్లు, నకిలీ డిగ్రీ, ఇంజనీరింగ్, డాక్టర్ డిగ్రీ పత్రములు, నకిలీ ఆహార పదార్థములు మానవులు తయారుచేయుచున్నారు. వారెవరూ మన యమపురికి ఇంకనూ రానందున మనము ఆ అరాచకములను అరికట్టలేక పోవుచున్నాము. అందువలన ఏకముగా ఇప్పుడు మన యమలోకము నుండియే ఒక ఆర్డరు తమ సంతకమును ఫోర్జరీ చేసి, జారీ చేసియున్నారు స్వామీ! ఇది ఒక కుట్ర!! భూలోకము నందు ఇటువంటి అరాచకము జరిగినప్పుడు– ఆ ప్రభుత్వ అరాచకమును మనము బహిర్గతము చేసినచో మన పరువు పోవును. కాబట్టి ఈ ఆర్డర్ మనము విడుదల చేసినట్లే అంగీకరించి, నేటి నుండి అమలు చేయవలసియున్నది" అన్నాడు చిత్రగుప్తుడు.

"అటులైన ఆ ఆర్డరు చదువు!"

"స్వామీ! ఈ ఆర్డర్ ప్రకారం... భూలోకము నుండి మరణించిన వ్యక్తి మన లోకమునకు వచ్చిన తరువాత– తనని భూలోకమునందు ఖననము చేయులోపున, తాను తన కుటుంబంలో గానీ, భూలోకములో గాని చేయవలసిన పనులు మిగిలిపోయిన యెడల, లేదా తన యొక్క కోరికలు అసంపూర్తిగా వుండిపోయిన యెడల– సదరు పనులు, కోరికలు పూర్తియగువరకూ తన మరణమును పొడిగించుకొనుటకు గడువు దరఖాస్తు చేసుకొనవలసి యున్నది–"

యముడికి ఎ..క్క..డో.. మండింది!

"గడువు దరఖాస్తా– అదేమి?" యముడు గడగడలాడి పోతున్నాడు. గద కూడా కంపించిపోతోంది. యమపాశం ఎగిరెగిరి పడుతోంది.

"అయ్యా! భూలోకమున ఈ వాడుక ప్రభుత్వములో అమలులో వున్నది. వివరముగా చెప్పెదను ప్రభూ... తమరు అనవసరంగా ఉద్రేకము చెందకండి! తమకు రక్తపుపోటు అధికముగా ఉన్నదనీ, అధికముగా ఉద్రేకము చెందవలదనీ యమలోక వైద్యులు సలహా ఇచ్చియున్నారు. మనము కాలానుగుణముగా మన నియమ నిబంధనలు మార్చుకొనవలసి యున్నది."

"సరే... చెప్పుము!"

"భూలోకమున ప్రజాపనుల శాఖ వారు చేయు ప్రజాపనులు గడువు లోపున పూర్తిచేయలేకపోయినచో సదరు కాంట్రాక్టరు గడువు దరఖాస్తు సమర్పించుకొనును. అనగా

సంవత్సర కాలములో పూర్తిచేయవలసిన పనిని సకాలములో పూర్తిచేయలేకపోయినచో- ఎందుకు పూర్తిచేయలేకపోయినాడో కారణములు వివరముగా తెలుపుచూ, మరికొంత కాలము ఆ పని పూర్తిచేయుటకు గడువు పొడిగించమని ప్రభుత్వమునకు అర్థింపు లేఖ సమర్పించుకొనును. ప్రభుత్వము సదరు కాంట్రాక్టరు దరఖాస్తును పరిశీలించి, పనులను తనిఖీ చేసి, అతని విజ్ఞప్తి సరియైనదని భావించినచో- గడువు పొడిగింపు మంజూరు చేసేదరు!" అన్నాడు చిత్రగుప్తుడు.

"అయినచో... ఇది మనకేల వర్తించును?" అన్నాడు సమవర్తి.

"ఎందుకు వర్తించదు స్వామీ? మానవులు చాలా తెలివైనవారు. వారు మరణించిన వెంటనే మన రాజ్యమునకు వచ్చి, మన ఇద్దరినీ ముప్పుతిప్పలు పెట్టే ప్రశ్నలు వేసి మనలను పలు ఇబ్బందులకు గురిచేసి, మొహమాట పెట్టి, తమ తమ మరణములు వాయిదా వేసికొనెదరు. వెంటనే వెళ్లిపోయెదరు బ్రతికిపోయి..!"

చిత్రగుప్తుని మాటలు పూర్తి కాకుండానే- "నాకు ఇప్పుడిప్పుడే తెలియుచున్నది విషయము... మనము చాలా నిర్మొహమాటముగా వుండవలెను!" అన్నాడు కోపంతో.

ఇద్దరు యమలోక వనితలు వచ్చి యముని నోటిలో రక్తపుపోటు తగ్గించే మాత్రలు వేసి- బంగారంతో చేసిన సన్నగా, నాజూకుగా ఉన్న పాత్రతో ద్రవం పోసి, ఆయన గుండెలపై నిమిరి వెళ్లిపోయారు.

ఇంతలో...

నలుగురు భటులు రక్తపుమడుగులో మునిగిపోయినట్లున్న ఒక భారీకాయాన్ని తీసుకువచ్చారు. ఆ శాల్తీ కళ్ళు, నోరు మాత్రం కనుపిస్తున్నాయి. మిగతా శరీరమంతా రక్తంతో నిండివుంది.

"యమరాజా! ఇదుగో... మనకు 'గడువు పొడిగింపు దరఖాస్తు'తో మొదటి మానవుడు వచ్చియున్నాడు."

"అతని వద్ద ఆ పత్రం తీసుకుని చదువు!" అని యముడు అనగానే-

యమభటులు అతని పెదవుల మధ్యన వున్న కాగితం తీసి చిత్రగుప్తునికి ఇచ్చారు.

దానినిండా రక్తం ఉంది. చిత్రగుప్తుడు చిరాగ్గా మునివేళ్లతో ఆ కాగితం అందుకుని- "చిత్తగించండి ప్రభూ..." అన్నాడు.

"ఇతని పేరు బాబుల రెడ్డి- కాని, అందరూ 'బాంబుల రెడ్డి' అని పిలుస్తారు ప్రభూ! ఆంధ్రప్రదేశమునకు చెందినవాడు. ఒక చిన్నగ్రామంలో రాజకీయం చేయుచున్నాడు. ఇతను శ్రావణశుద్ధ ఏకాదశినాడు మన రాజ్యమునకు రావలసి యున్నది. కాని, ఇతని శత్రువుల చేతిలో బాంబులచే చంపబడి మన రాజ్యమునకు వచ్చియున్నాడు. ఇతను మరో పది సంవత్సరములు తన మరణమును పొడిగింపవలసినదిగా అర్థించుచున్నాడు."

"అదిసరే చిత్రగుప్తా! ఇతని శరీరము ఛిద్రమై ఉన్నది. కనులు, నోరు మాత్రమే కనపడుచున్నవి. ఇతను ఎట్లు తిరిగి జీవించును?"

"ప్రభూ! ఇతని గుండెకాయ మాత్రమే పదిలముగా వున్నది. అయిననూ మన యమమాయ వలన ఏమైనా చేయవచ్చును గదా!"

"అతనితో మాట్లాడవలయును కదా!" అని యముడు అనగానే- చిత్రగుప్తుడు తన వద్దనున్న వింజామరతో అతనిపై గాలి విసిరాడు.

అంతే... క్షణంలో ఆ వ్యక్తి లేచి నిలబడ్డాడు.

అతను సుమారు ఆరు అడుగుల ఎత్తు వున్నాడు. పొందూరు ఖద్దరు పంచె, లాల్చీ. నిమ్మకాయలు నిలబెట్టగలిగే మీసాలు, మెడలో నాలుగైదు బంగారు గొలుసులు. దాదాపు అన్ని చేతివేళ్లకు ఉంగరాలు, ఒక చేతిలో బంగారుపిడి వున్న పొన్నుకఱ్ఱ, ఉబ్బిపోయిన కళ్ళు, భారీ శరీరం... చాలా భయంకరంగా వున్నాడు. మీసాలు దువ్వుకుంటున్నాడు.

అతని రెండువైపులా వున్న యమభటులకీ, చిత్రగుప్తునికీ, ముఖ్యంగా... యమునికి చాలా అసహనంగా వుంది- అతని పొగరుబోతు ప్రవర్తనకు.

చిత్రగుప్తుడు గొంతు సవరించుకొని- "మానవా! నువ్వు ఈ లోకంలో కొన్ని నియమాలు పాటించాలి. చేతులు కట్టుకుని సవినయంగా నిలబడవలె!" అన్నాడు.

మానవుడు వెంటనే లాల్చీజేబులో చెయ్యిపెట్టి ఆరు అంగుళాల చుట్ట తీసి, అగ్గిపెట్టెతో వెలిగించి రైలింజన్‌లా పొగ వదిలాడు.

యముడికీ, చిత్రగుప్తుడికీ, భటులకూ దగ్గు వచ్చింది. వాళ్ళు ఈ 'క్రమశిక్షణా రాహిత్యాన్ని' భరించలేకపోతున్నారు. అయినా ఏమీ చేయలేని స్థితి!

"నీ యబ్బ- ఏంటెహె... చెప్పేది? నేను అందులో రాసుండ్లా? నన్ను ఈడకు లాక్కురావడానికి నీకు పవర్సు లేవు తెలుస్తుండారా? నేను ఇంకా ఎన్నో సంవత్సరాలు బ్రతికుండాలా! నేను ముఖ్యమంత్రిని కావాల్న! అంతలోకే నువ్వెట్టా తీసుకొస్తావబ్బా నన్ను? అందుకే మీ యమలోకంలో స్టాఫ్‌ని మేనేజ్ చేసి కొత్త ఆర్డరుని నీ సంతకం ఫోర్జరీ చేసి పుట్టించా! ఈ రెడ్డితో గేమ్స్ ఆడబాకు. నా చిటికెన వేలితో నీ యమలోకాన్ని గడగడలాడించ గల్ను. తెలుస్తుండారా... యముండా!" అన్నాడతను.

యముడు అనాలోచితంగా మీసాల మీద చెయ్యి వేసి, 'యముండ..!' అనుకున్నాడు.

అందుకు ఆ మానవుడు వెంటనే నవ్వుతూ...

"నా పార్టీలో పిల్లోడిగా వున్నప్పటినుండి జెండా పట్టుకుని తిరుగతా ఉండా! జెండా నుండి పంచాయితీ మెంబర్నీ అయినా! ఆ తరువాత సర్పంచి గాన్ని పొడిపించి సర్పంచి అయినా! జడ్పీటిసి గాన్ని ఏసేసి జెడ్పీటిసి అయినా! జెడ్పీ ప్రెసిండెంట్‌ని లారీ ఏక్సిడెంట్ చేసి ప్రెసిడెంట్ అయినా! ఎమ్మెల్యే గాన్ని మందుపాతరలో పెట్టి ఎమ్మెల్యే అయినా! ఇప్పటికి వెయ్యి ఎకరాల మాగాణి, కోట్లు దుడ్డు సంపాయించినానుకో! మరి, ముఖ్యమంత్రి కాకుండా ఎట్లా చచ్చిపోవాల్నబ్బా... ఇదేం న్యాయం?"

యముడు మధ్యలో కలగజేసుకుని "అయితే నువ్వు ముఖ్యమంత్రి అయితే గాని మా రాజ్యమునకు రానందువా? కనీసం... అప్పుడైనా వచ్చెదవా?" అన్నాడు.

అందుకు ఆ మానవుడు "అదెట్టా కుదురుద్ది? నేను ముఖ్యమంత్రిని అయ్యానే అనుకో... మా బుడ్డోడు ఎమ్మెల్యే అవుతాడు గందా! వాడిని నేను ముఖ్యమంత్రిగా చూడాల్నా? వద్దా? నేను మీ లోకానికి వచ్చేత్తే... నా కోరికలన్నీ ఎట్టా తీరుతాయబ్బా? చెప్పు సామీ?" అన్నాడా మానవుడు.

యముడు విసిగిపోయి- "అయినచో నీకు మరణము ఎన్ని సంవత్సరములు పొడిగింపవలెనో చెప్పుము!" అన్నాడు.

అతను హాహాకారం చేసినట్లు నవ్వాడు. ప్రక్కనే ఉన్న భటులూ, చిత్రగుప్తుడూ దడుచుకున్నారు. యముడు కూడా ఝడుసుకున్నాడు గాని, అది బయటకి కనిపిస్తే పరువు పోతుందని గాంభీర్యం నటించాడు.

"అదిగాని గానీ... చూడు సామీ! నాకు అస్సలు మరణమే లేకుండా సూడబ్బా... నీకు సూట్‌కేసులు అప్పచెప్తాను!" అన్నాడు.

అప్పటికే నిండా వెయ్యి రూపాయలు, ఐదు వందల రూపాయల నోట్లకట్టలు వున్న నాలుగు సూట్‌కేసులు చిత్రగుప్తునికి ఇచ్చాడు ఆ మానవుడు.

"సూట్‌కేసులన్న ఏమిటి చిత్రగుప్తా..?" అడిగాడు యముడు అమాయకంగా.

"అది తమరే దర్శించండి మహోప్రభో..!" అని చిత్రగుప్తుడు అన్నాడో, లేదో- ఆ మానవుడు యమధర్మరాజుకు ఓ పది సూట్‌కేసులు అందించాడు.

యమధర్మరాజు ఆ సూట్‌కేసులు తెరిచాడు. వాటినిండా డబ్బు, బంగారం ఉండటం చూసి అందరూ తెల్లబోయి చూస్తూండగా- "యమరాజా! తమ రాజ్యానికి ప్రతినెలా ఈ పద్ధతిలో సూట్‌కేసులను పంపిస్తాను. మీరు నన్ను మర్చిపోవాలి... తెలుస్తుండాదా?" అన్నాడా మానవుడు.

"చిత్రగుప్తా! మనకు ఈ బంగారము, డబ్బుతో పని ఏమి?" అన్నాడు యముడు.

"తెలిపెదను ప్రభూ! మనము అప్పుడప్పుడు భూలోకమునకు తనిఖీ చేయుటకు వెళ్లవలెను కదా..."

"తనిఖీ అనగా..?"

"భూలోకము నుండి 'చనిపోయిన వారినందరినీ మన భటులు సక్రమముగా యమలోకమునకు తీసుకువచ్చుచున్నారా? లేక, చనిపోయిన వారి వద్ద నుండి కానుకలు, వగైరాలు పుచ్చుకొని ఇక్కడకు తేకుండా అక్కడే వుంచేస్తున్నారా...' అన్న విషయం పరిశీలించ వలసియున్నది కదా!"

"అవును... నిజమే! అయిననూ ఈ బంగారము, డబ్బుతో మనకు పని ఏమి?"

"ఆ విషయమునకే వచ్చుచుంటిని ప్రభూ! అలా తనిఖీ నిమిత్తము మనము భూలోకమున కేగినపుడు మన హోదాను బట్టి అక్కడ ఐదు నక్షత్రముల సత్రము లందు బస చేయవలసియుండును. భూలోకమున భోగభాగ్యములు, అప్సరసల పొందు చవిచూడవలసి యుండును. అందులకు వేలవేల రూపాయలు అవసరము."

"ఆగుము చిత్రగుప్తా... రాణులు వినే ప్రమాదం వున్నది!" అన్నాడు యముడు అటూ ఇటూ చూసి.

"అయినచో... ఈ మానవునికి మనము గడువు పొడిగింవలసియున్నది ప్రభూ!" అన్నాడు చిత్రగుప్తుడు.

"అటులనే..!" అన్నారు యమధర్మరాజు ఇంకేం ఆలోచించకుండా.

●

**భూ**లోకంలో...

అది ఒక పెద్ద బంగ్లా!

చుట్టూ నాలుగైదు ఎకరాల ఖాళీస్థలం ఉంది. ఆ స్థలంలో ఇసక వేస్తే రాలని జనం!

బంగ్లా ముందు హాలులో ఐస్‌బాక్స్‌లో... ఆరోజు ఉదయం బాంబు దాడిలో మరణించిన ప్రముఖ రాజకీయ నాయకుని భౌతికకాయం ఉంది.

ఆయన నాలుగుసార్లు వరుసగా ఆ నియోజకవర్గంలో ఎన్నికైనారు. వచ్చే ఎన్నికలలో ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందని కూడా జనం అనుకుంటున్నారు.

భార్యాపిల్లలూ, కార్యకర్తలూ, బంధువులూ ఏడుస్తున్నారు. చుట్టూ భగవద్గీత, బైబిలు, ఖురాను పఠనం జరుగుతోంది. భజనలు చేస్తున్నారు.

కొంచెంసేపట్లో ముఖ్యమంత్రిగారు, గవర్నర్‌గారు అక్కడికి రాబోతున్నారు. ఆ తర్వాత అంత్యక్రియలకు ఏర్పాట్లు మొదలవుతాయి.

ఇంతలో... గ్లాస్‌బాక్స్ బద్దలు కొట్టుకుని ఆయన లేచి నిలబడ్డారు... "ఏందబ్బా... ఇంతమంది ఉండారు నా దగ్గర? నాకు ఏమైనాది?" అంటూ అర్థంకానట్టు చుట్టూ చూడసాగారాయన.

రక్తంతో తడిసిన బట్టలతో ఆయన చాలా భయంకరంగా ఉన్నారు. బాంబు దాడిలో తునాతునకలైపోయిన ఆయన ఎలా బ్రతికాడో అర్థంకాక- దెయ్యమయ్యాడేమోననుకొని జనం తమ పక్కనే బాంబులు పడినట్లు తలో పక్కకి పరుగులెత్తారు.

క్షణాలలో ఆ ప్రదేశం అంతా ఖాళీ అయిపోయింది. ఆయన భార్యాపిల్లలు, బంధువులూ బంగ్లాలోకి వెళ్లిపోయారు. అందరూ పరుగులు పెడుతున్నారు... వెనక్కితిరిగి చూడటం లేదు.

ఆయన ఇద్దరు సెక్యూరిటీ గార్డులు మాత్రం- వెళ్లిపోతే వాళ్ళ ఉద్యోగాలు పోతాయి కాబట్టి- ఆయన దగ్గరే నిలబడివున్నారు. 'ఈయన ఎలా బ్రతికాడ్రా బాబూ..?!' అనుకుంటూ వింతగా చూస్తున్నారాయన్ని.

"ఏందిరా ఇది... పిచ్చి జనం?" అంటున్నారాయన.

●

'వార్తాసాగరం' దినపత్రిక ... **14 జూలై' నుండి 18 జూలై' 2005** సంచికలలో ప్రచురితం